రాత్రివేళల్లో అక్రమ మొరం దందా

జాతర్ల చెరువులో మొరం తవ్వకాలకు పాల్పడిన జేసీబీ

బజార్‌హత్నూర్, జూన్ 12: బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామ సమీపంలోని చెరువులో జేసీబీ యంత్రంతో మూడు రోజులుగా అర్ధరాత్రి నుంచి ఉదయం 4 గంటల వరకు మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని ఒక వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా సదరు గుత్తేదారు స్థానిక అధికారులు, నాయకులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో మొరం దందా నడిపించడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సంబంధిత శాఖ ఇరిగేషన్ ఏఈ తిరుపతిని వివరణ కోరగా చెరువులోని మట్టిని, మొరంను తవ్వడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అలాంటి తవ్వకాలు జరిపిన వారిపై శాఖ పరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో ఏస్ఈ చౌహాన్

ఎదులాపురం, జూన్ 12 : విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈజేఆర్ చౌహాన్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారుల నుంచి పలు విద్యుత్ సమస్యలపై అర్జీలను ఎస్ఈకి సమర్పించారు. వాటి పరిష్కారానికి విద్యుత్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ శంకర్, అసిస్టెంట్ డీఈ శివప్రసాద్, ఏఏవోకే ప్రదీప్, ఏఈ నమ్రత, ఏఏఈ సదానందం పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎదులాపురం, జూన్ 12 : బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మున్సిపల్ కమీషనర్ ఖమర్ అహ్మద్ మసీద్ సోదరులు, హిమామ్లతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ముస్లింలకు ముందుగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ నేపథ్యంలో వ్యర్థాలను మున్సిపల్ ట్రాక్టర్లకు మాత్రమే వేయాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న మున్సిపల్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రతి ఏటా లాగే ఈ సారి కూడా బక్రీద్ పండుగకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

మట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- పంచాయతీ రాజ్, వైద్య శాఖల అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 12 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం పంచాయతీ రాజ్, వైద్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రైనేజీలలో వర్షపు నీరు నిల్వ కుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, అతిసార, అమీబియాసిస్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. డ్రైడే పాటించాలన్నారు. ఈ నెల 12 నుంచి 19 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీపీవో శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

ఎంపీపీని సన్మానిస్తున్న మండల నాయకులు

బోథ్, జూన్ 12 : మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్య ప్రాథమిక హక్కు

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ సౌజన్య

ఎదులాపురం, జూన్ 12 : విద్య అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అందరూ చదువుకోవాలని తమ లక్ష్యాలను చేరే దిశగా ముందుకుపోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ సౌజన్య అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ఎస్ఆర్ డిజిటల్ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ విద్య దశ నుంచి పిల్లలు తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలని అ దిశగా కష్టపడి వాటిని సాధించాలన్నారు. ఐసీడీఎస్ సంక్షేమాధికారి సబిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హెల్ప్‌లైన్ నంబర్‌ను గుర్తించుకొని ఆపద సమయంలో అవసరం ఉన్నప్పుడు 1098 నంబర్‌కు ఫోన్ చేసి మీ సమస్యలు తెలియజేయాలన్నారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ మహిళల హక్కులు, హెల్ప్‌లైన్ నంబర్, ఫోక్సోయాక్ట్‌ల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర్, డీఎల్ఎస్ఏ సీనియర్ అసిస్టెంట్ శశికళ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధం చేయాలి

దస్తురాబాద్,జూన్ 12 : రానున్న హరితహారం కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలని మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మల్లాపూర్ గొండు గూడెం గ్రామంలో ఆయన పర్యటించారు. నర్సరీని, తదితర వాటిని ఆయన పరిశీలించారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. సర్వేలో ఇంటి యాజమానులను వివరాలు అడిగి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవీందర్, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలి

భైంసా, జూన్ 12 : ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజియన్ మేనేజర్ ప్రణీత్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించి ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని డిపోల కన్నా భైంసా డిపో అధిక ఈపీకే తీసుకరావడం జరిగిందని అన్నారు. అనంతరం స్టాల్స్‌ను సందర్శించి ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మేనేజర్ కేకే రెడ్డి ఉన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ

నిర్మల్ అర్బన్, జూన్ 12 : నిర్మల్ పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన అనిల్ కుమార్ రామగుండం గోదావరి ఖనికి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి డీసీఆర్‌బీ సీఐగా ఉంటూ టౌన్ సీఐ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. మారిన బదిలీల్లో టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు సన్మానం

ఎదులాపురం, జూన్ 12 : విద్యార్థులు ఉన్నత చదువును పూర్తి చేసి తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు, జిల్లా పేరును నిలబెట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులకు బుధవారం కలెక్టర్ చాంబర్‌లో పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల చైర్మన్ మహ్మద్ బిలాన్, పాల్గొన్నారు.

భూకబ్జాపై సర్వే

భూకబ్జాకు గురైన ప్లాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో జీవాకర్ రెడ్డి

ఎదులాపురం, జూన్ 12 : ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్ 38వ వార్డులో సొసైటీకి సంబంధించిన రెండు ప్లాట్లను తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి కబ్జా చేయాడానికి కొందరు ప్రయత్నించారు. ఈ విషయపై సోమవారం కలెక్టర్ రాజర్షి షాకు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్, కాలనీ వాసులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషన్ ఖమర్ అహ్మద్‌తో కలిసి కబ్జాకు గురువుతున్న స్థలాన్ని పరిశీలించారు. కబ్జా చేసిన ప్లాట్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కాలనీ వాసులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. భూకబ్జాకు చేయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి ముల్యాల చిట్టిబాబు, కాలనీ వాసులు రాంకిషన్, రాంకుమార్, రాంరెడ్డి, కొండల్‌రావ్, ఈశ్వర్‌దాస్, బాబురావు, రాజారామ్, రాకేశ్, ప్రవీణ్‌అగర్వాల్, మహేందర్ ఉన్నారు.

పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం

గంగజలానికి బయలుదేరుతున్న సూర్జాపూర్ గ్రామస్తులు

ఖానాపూర్ రూరల్, జూన్ 12: ఖానాపూర్ మండలం సూర్జాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి పండుగ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మహిళలు పవిత్ర గంగస్నానాన్ని ఆచరించి గంగజలం తీసుకెళ్లి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పోచమ్మ బోనాలు, శనివారం పెద్దమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పాఠశాలలో పూర్తయిన పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఎదులాపురం, జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ గండ్రత్ రమేశ్ పాల్గొని ప్రారంభించారు. ముందుగా గ్రామస్తులతో కలిసి ర్యాలీ తీశారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో వెంకటరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ పార్వతి, జయంత్, కిష్టయ్య, భూమన్న, దీపక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్-అయోధ్య మధ్య ఫ్లైట్ రద్దు

డిమాండ్ లేకపోవడంతో నిలిపివేసిన స్పైస్‌జెట్

ముంబై, జూన్ 12: హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేరుగా నడిపే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ప్రకటించింది. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ విమాన సర్వీసుకు డిమాండ్ లేమి కారణంగా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్-అయోధ్యల మధ్య వారానికి మూడు సార్లు నడిపే సర్వీసును ప్రారంభించింది. డిమాండ్-సప్లై ఆధారంగా విమాన సర్వీసులను నడుపుతున్నట్లు, ఈ సర్వీసును రద్దు చేసినప్పటికీ చెన్నై-అయోధ్యల మధ్య విమాన సర్వీసును యథాతథంగా నడుపుతున్నట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. అలాగే జనవరి 21 నుంచి ఢిల్లీ నుంచి అయోధ్యకు సంస్థ విమానాన్ని నడుపుతున్నది.

జీవిత బీమాపై రుణాలివ్వాల్సిందే

ఇన్సూరెన్స్ సంస్థలతో ఐఆర్డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 12: అన్ని జీవిత బీమా సేవింగ్స్ ప్లాన్లలో పాలసీ లోన్ సదుపాయం అనేది ఇకపై తప్పనిసరి అని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ బుధవారం ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. జీవిత బీమా తీసుకున్న పాలసీదారులకు నిబంధనలకు లోబడి వారి పిల్లల ఉన్నత చదువులు, పెండ్లిళ్లు, గృహ నిర్మాణం లేదా కొనుగోలు, వైద్య చికిత్స తదితర నగదు అవసరాలను బట్టి రుణాలు ఇవ్వాల్సిందేనని సదరు సంస్థలకు చెప్తూ ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. జీవిత బీమా పాలసీలకు సంబంధించి ఉన్న అన్ని రెగ్యులేషన్లను ఏకం చేస్తూ దీన్నిచ్చింది. ఇక పాలసీదారులు తమ పాలసీ నిబంధనలు, షరతులను సమీక్షించేందుకున్న సమయాన్ని (ఫ్రీ లుక్ పీరియడ్) 15 రోజుల నుంచి 30 రోజులకు ఐఆర్డీఏఐ పెంచింది. ఇప్పటికే జనరల్ ఇన్సూరెన్స్ పాలసీల కోసం కూడా ఐఆర్డీఏఐ ఇదే తరహా మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. కాగా, పాలసీలను సరెండర్ చేస్తే పాలసీదారులకు ప్రయోజనకరంగా బీమా సంస్థల నిర్ణయాలుండాలని ఐఆర్డీఏఐ తెలిపింది.

హెల్మెట్లపై జీఎస్టీ ఎత్తేయండి

కౌన్సిల్‌ను కోరిన ఐఆర్ఎఫ్

న్యూఢిల్లీ, జూన్ 12: హెల్మెట్లపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయాలని బుధవారం జీఎస్టీ కౌన్సిల్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలను అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కోరింది. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. దీంతో దీన్ని సున్నా (నిల్ లేదా జీరో)కు చేర్చాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. హెల్మెట్ల వాడకాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారన్న ఐఆర్ఎఫ్.. హెల్మెట్లపై జీఎస్టీని తొలగిస్తే వాటి అమ్మకాలు పెరిగి, తద్వారా టూవీలర్ వినియోగదారుల భద్రత కూడా పెరుగుతుందన్నది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాద మరణాల్లో దాదాపు 12 శాతం భారత్‌లోనే సంభవిస్తున్నాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను 15.71-38.81 బిలియన్ డాలర్ల మేర నష్టపరుస్తున్నట్లు బాష్ నివేదిక పేర్కొన్నదని ఐఆర్ఎఫ్ గుర్తుచేసింది.

వాణిజ్య

అత్యంత విలువైన సంస్థగా యాపిల్

న్యూయార్క్, జూన్ 12: ప్రపంచంలో అత్యంత విలువైన సంస్థగా మళ్లీ యాపిల్ అవతరించింది. ఇప్పటి వరకు తొలి స్థానంలో కదలాడిన మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి యాపిల్ తిరిగి తొలి స్థానాన్ని దక్కించుకున్నది. అంతర్జాతీయంగా ఐఫోన్ల అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో కంపెనీ షేరు ధర రికార్డు స్థాయిలో లాభపడటమే ఇందుకు కారణం. కంపెనీ షేరు ధర 4 శాతం లాభపడి 215.04 డాలర్లకు చేరుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ 3.29 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ పడిపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ 3.24 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది.

ఇంజెస్‌తో రెడ్డీస్ జట్టు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్..అమెరికాకు చెందిన ఇంజెస్ ఫార్మాస్యూటికల్స్‌తో జట్టుకట్టింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం వాడే సైక్లోఫాస్ఫామైడ్ ఇంజెక్షన్‌ను అక్కడి మార్కెట్లో విక్రయించడానికి సంస్థతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. 500 ఎంజీ/2.5 ఎంఎల్, 1గ్రాము/5 ఎంఎల్, 2గ్రాము/10 ఎంఎల్ రకాల్లో అమెరికా మార్కెట్లో ఈ ఔషధం లభించనున్నది. మార్చితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధ విక్రయాలు 51.8 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి.

ఆగిన పారిశ్రామిక పరుగు

3 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి • ఏప్రిల్‌లో 5 శాతానికి ఐఐపీ పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 3 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 5 శాతానికే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పరిమితమైంది. ఈ మేరకు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. దీన్నిబట్టి గనులు, విద్యుత్తు రంగాల ప్రదర్శన బాగున్నా.. కీలకమైన తయారీ రంగం తీరు పేలవంగా ఉండటమే ఐఐపీ క్షీణతకు కారణంగా నిలుస్తున్నది. ఈ ఏడాది మార్చిలో 5.4 శాతంగా, ఫిబ్రవరిలో 5.6 శాతంగా ఉన్న ఐఐపీ.. జనవరిలో 4.2 శాతంగానే ఉన్నది. మళ్లీ ఇప్పుడు అదే స్థాయి దరిదాపుల్లోకి ఏప్రిల్ గణాంకాలు నమోదయ్యాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఐఐపీ వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 5.2 శాతం. ఇకపోతే గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 4.6 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో ఈసారి ఏప్రిల్‌లో పెరిగినట్టే కనిపిస్తున్నది. కానీ గత మూడు నెలలుగా క్రమేణా గణాంకాలు తగ్గుముఖం పడుతుండటం మాత్రం ఒకింత ఆందోళననే కలిగిస్తున్నది.

రంగాలవారీగా..

తాజా గణాంకాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో గనుల రంగంలో ఉత్పాదకత వృద్ధి 6.7 శాతానికి పెరిగింది. నాడు 5.1 శాతమే. అలాగే విద్యుదుత్పత్తి కూడా 1.1 శాతం నుంచి 10.2 శాతానికి ఎగిసింది. అయితే తయారీ రంగంలో వృద్ధిరేటు ఏప్రిల్‌లో 3.9 శాతానికి క్షీణించింది. పోయినసారి ఏప్రిల్‌లో 5.5 శాతంగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఐఐపీ ఓవరాల్ గ్రోత్ దెబ్బతిన్నది. దీనికితోడు క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి సైతం 3.1 శాతానికి పతనమైంది. ఏడాది క్రిందట 4.4 శాతంగా ఉన్నదిది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి కూడా మైనస్ 2.4 శాతంలోకి దిగజారింది. నిరుడు ఏప్రిల్‌లో 11.4 శాతం వృద్ధి కనిపించింది. అందుకే కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 9.8 శాతానికి పుంజుకున్నా ఫలితం లేకపోయింది. నిజానికిది పోయినసారి మైనస్ 2.3 శాతంలో ఉన్నది. మౌలిక, నిర్మాణ రంగాల్లో వృద్ధిరేటూ 8 శాతంగానే ఉన్నది. నిరుడు ఏప్రిల్‌లో 13.4 శాతం. ఇక ప్రైమరీ గూడ్స్ ఉత్పాదక రేటు 1.9 శాతం నుంచి 7 శాతానికి, ఇంటర్మీడియెట్ గూడ్స్ గ్రోత్ 1.7 శాతం నుంచి 3.2 శాతానికి పెరిగినా ఐఐపీని గతంతో పోల్చితే పెంచలేకపోయాయి.



స్వల్పంగా తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల స్వల్పంగా తగ్గింది. మే నెలలో 4.75 శాతంగా నమోదైంది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉన్నది. అయితే నిరుడు మే నెలలో 4.31 శాతంగానే ఉన్నది. దీన్నిబట్టి ఈసారి అర శాతంపైనే పెరిగినట్టైంది. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గరిష్ఠ ద్రవ్యోల్బణం స్థాయి 6 శాతం. కానీ ఆమోదయోగ్య స్థాయి 4 శాతమే. దీంతో ప్రస్తుత గణాంకాలు ఇంకా తగ్గాల్సి ఉన్నది. అప్పుడే వడ్డీరేట్లను తగ్గిస్తామని గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేసినది తెలిసిందే. నిరుడు ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లు యథాతథంగానే కొనసాగుతున్నాయి. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరిలో వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచింది.

ఇక అప్పట్నుంచి రెపోరేటు 6.5 శాతం వద్దే ఉన్నది. ఫలితంగా గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాల భారం రుణగ్రహీతలపై పడుతూనే ఉన్నది. ఇదిలావుంటే మే నెలలో ఆహార ద్రవ్యోల్బణం 8.69 శాతంగా ఉన్నది. ఏప్రిల్‌లో ఇది 8.70 శాతంగా ఉన్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది.

డిపాజిట్లపై తగ్గనున్న వడ్డీరేట్లు!

న్యూఢిల్లీ, జూన్ 12: డిపాజిట్లపై వడ్డీరేట్లు పతాకస్థాయికి చేరుకున్నాయని, స్వల్పకాలంలో ఈ రేట్లు తగ్గే అవకాశం ఉన్నదని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. అలాగే రిజర్వు బ్యాంక్ కూడా వడ్డీరేట్లను కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి తగ్గించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. గత వారంలో తన పరపతి సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మూడో త్రైమాసికం నుంచి రిటైల్ ధరల సూచీ నాలుగు శాతం దిగువకు తగ్గే అవకాశం ఉండటంతో ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికే పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయని, వీటిలో స్విట్జర్లాండ్, స్వీడన్, కెనడా, యూరో దేశాలు తగ్గించిన విషయం తెలిసిందే. మరోవైపు, గత నెలలో ఎస్బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచిన విషయం తెలిసిందే.

రికార్డుస్థాయికి నిఫ్టీ

స్వల్పంగా పెరిగిన సెన్సెక్స్

ముంబై, జూన్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో భారీగా పుంజుకున్న సూచీలకు చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. బ్లూచిప్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాపడటం మదుపర్లలో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ నిర్ణయాన్ని ప్రకటించనున్నప్పటికీ పెట్టుబడిదారులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో 149.98 పాయింట్లు అందుకొని 76,606.57 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ రికార్డు స్థాయికి ఎగబాకింది. ఇంట్రాడేలో 177.1 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 23,441.95 పాయింట్లను తాకిన సూచీ చివరికి 58.10 పాయింట్లు పెరిగి 23,322.95 వద్ద స్థిరపడింది. సూచీలకు ఇది కూడా గరిష్ఠ స్థాయి కావడం విశేషం.

429 లక్షల కోట్లకు మదుపరుల సంపద

మార్కెట్లు భారీగా పుంజుకోవడంలో మదుపరుల సంపద కూడా అంతే స్పీడ్‌తో పెరుగుతున్నది. బుధవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,29,32,991.65 కోట్లు(5.14 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నది. ఇది కూడా చారిత్రక గరిష్ఠ స్థాయి.

హైదర